సర్వాయి పాపన్నకు ఘన నివాళి

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 2 : సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్‌లో పాపన్న విగ్రహానికి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రాజాపూర్‌లో..

జడ్చర్ల(రాజాపూర్), ఏప్రిల్ 2 : రాజాపూర్ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

ఊట్కూర్, ఏప్రిల్ 2 : రంజాన్ సందర్భంగా మండలంలోని పగిడిమర్రి, పులిమామిడి గ్రామాల్లో ముస్లింలకు కాంగ్రెస్ నాయకులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై ముస్లింలకు పండ్లు తినిపించారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ సూరయ్య గౌడ్, నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, అలీం, గోవర్ధన్ పాల్గొన్నారు.

పీయూలో ప్రాంగణ ఎంపికలు

పాలమూరు, ఏప్రిల్ 2 : పాలమూరు విశ్వవిద్యాలయంలో అకాడమిక్ ఆడిటోరియంలో మం గళవారం శ్రీ విజయ బయో ఫర్టిలైజర్స్ ఆ ధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీయూ ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్‌కుమార్ మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికలో 32మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 2 : యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రంగారెడ్డి, ఏపీపీసీ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ప్రకాశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భవన నిర్మాణ కార్మికశాఖ, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కార్మిక శాఖలో నమోదు చేసుకున్న కార్మికుల పిల్లలకు కేరీర్ గైడెన్స్, రెస్యూమ్ ప్రిపరేషన్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతలో నైపుణ్యం కొరతను తీర్చడం కోసం 41 రకాల కంప్యూటర్ కోర్సులను యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

వంశీచంద్.. అసత్య ప్రచారాలు మానుకో..

- ఎంపీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె, మాజీ ఎమ్మెల్యే ఆల

పాలమూరు, ఏప్రిల్ 2 : అసత్య ప్రచారాలు మాని, వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మహబూబ్‌నగర్‌లోని పద్మావతికాలనీ గ్రీన్‌బెల్ట్ వద్ద మంగళవారం సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాకే మహనీయుల చరిత్రను ప్రపంచానికి చాటేలా వారి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని అధికారికంగా జయంతి, వర్ధంతి నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. బహుజన వ్యతిరేకి అయిన వంశీచంద్‌రెడ్డి అసత్య మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంశీచంద్‌కు సర్వాయి పాపన్న, ఆయన చరిత్ర తెలియదన్నారు. పాలమూరులో పాపన్న విగ్రహం పెట్టిందెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. తన అభ్యర్థన మేరకే ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహ ఏర్పాటుకు రూ.3కోట్లను ప్రభుత్వం విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కానీ తాను పాపన్న విగ్రహం పెట్టమని అడగలేదని, జయంతి, వర్ధంతి అధికారికంగా చేయాలని కోరలేదని వంశీచంద్‌రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉత్తర్వులు చూసి మాట్లాడాలని హితవు పలికారు. 720 ఎకరాలు కబ్జా చేశానని ఆరోపిస్తున్నారు.. ఏడు గజాలైనా కబ్జా చేసినట్లు నిరూపించు.. అది అబద్ధం అని తెలిస్తే క్లాక్‌టవర్ వద్ద ముక్కు నేలకు రాస్తావా? అని సవాల్ విసిరారు. బహుజనులు ఇండ్లు కట్టుకోకుండా గుడిసెల్లోనే ఉండాలా? తనపై ఆరోపణలు చేస్తే ఎన్నికల్లో ఓట్లు పడతాయని అనుకుంటున్న బహుజన వ్యతిరేకి వంశీచంద్‌రెడ్డికి ఎన్నికలలో బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. తన ఓటమి కోసం బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర‌రెడ్డి, జె డ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వారాజ్, గ్రంథాలయాల సంస్థ మాజీ చై ర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కేసీ నర్సింహులు, ఎంపీపీ సుధాశ్రీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి

- డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

మక్తల్ టౌన్, ఏప్రిల్ 2: ఉప్పులో అయోడిన్ శాతం లోపిస్తే పిల్లల్లో పెరుగుదల లోపిస్తుందని, బుద్ధి మాంద్యం, మానసిక బలహీనత ఏర్పడే అవకాశం ఉంటుందని నారాయణపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ సౌభాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మక్తల్ మండలం కర్ని, ముసలైపల్లి, చందాపూర్, సంగం బండ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నటువంటి 12 సంవత్సరాలోపు పిల్లలకు వైద్య పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్నటువంటి ఆరు నుంచి 12 సంవత్సరాల పిల్లల్లో ఉప్పు ఐరన్ వల్ల థైరాయిడ్ వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ తిరుపతి, సిబ్బంది, అధ్యాపక బృందం విద్యార్థులు ఉన్నారు.

ఊట్కూర్‌లో..

ఊట్కూర్, ఏప్రిల్ 2 : మంగళవారం స్థానిక ఉర్దూ మీడియం ఎంపీయూపీఎస్, నిడుగుర్తి, కొల్లూరు యూపీఎస్‌లో మంగళవారం విద్యార్థుల్లో అయోడిన్ లోపంతో వచ్చే రుగ్మతల గురించి ఉప్పు పరీక్ష, మూత్ర పరీక్ష నిర్వహించినట్లు డాక్టర్ బాలాజీరావు పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ అయోడిన్ కలిగిన ఉప్పునే వాడాలని వైద్యులు సూచించారు. కా ర్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు భవాని, ఎంపీహెచ్ఈవో విజయకుమార్, సూపర్‌వైజర్ మణిమాల, ఏఎన్ఎంలు కవిత, మహేశ్వరి పాల్గొన్నారు.

మక్తల్ టౌన్ : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

నారాయణపేటలో..

నారాయణపేట, ఏప్రిల్ 2 : ప్రతిఒక్కరూ అయోడిన్‌తో కూడిన ఉప్పునే వాడాలని యూపీహెచ్‌సీ వైద్యాధికారి నర్సింహారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని దయానంద్ విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల్లో గాయిటర్ వ్యాధి నిర్ధారణ పరీక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 6 నుంచి 12ఏండ్లలోపు విద్యార్థుల ఇంటి నుంచి ఉప్పును తెప్పించి పరీక్షించారు. 40మంది బాలికలు, బాలురకు గాయిటర్ వ్యాధి పరీక్షలు నిర్వహించారు. ప్రతి పది మంది విద్యార్థుల యూరిన్‌ను సేకరించి పరీక్షల కోసం లాబరోటరీకి పంపించారు. అనంతరం అయోడిన్ లోపం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నారాయణ, ఏఎన్ఎంలు పుష్ప, సరస్వతి, రామేశ్వరి, పుష్పలత పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోస్గి, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలోని బోగారం, గుండుమాల్, కోస్గి గ్రామాల్లో మంగళవారం 6,7, 8 తరగతి విద్యార్థులకు గాయిటర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించినట్లు డాక్టర్ కిష్టమ్మ తెలిపారు. నాలుగు టీంలతో 360 మంది విద్యార్థులకు నిర్వహించామన్నారు.

కాంగ్రెస్‌లో ఇసుక పంచాయితీ!

- ఓ వర్గం తరలిస్తుంటే అడ్డుకుంటున్న మరో వర్గం
- దాసర్‌దొడ్డి శివారులో రోడ్డును అడ్డంగా తవ్విన వైనం
- కాంగ్రెస్ నేతల తీరుపై స్థానికుల ఆగ్రహం

రోడ్డును తవ్విన కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు

మక్తల్ టౌన్, ఏప్రిల్ 2 : కాంగ్రెస్‌లో వర్గపోరు భగ్గుమన్నది. నారాయణపేట జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మన ఇసుక-మన వాహనం అనే వెబ్‌సైట్ ద్వారా గృహ, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి మాగనూరు మండలం వర్కూర్ గ్రామ శివారులోని వాగు నుంచి ఇసుక తరలిస్తున్నారు. వర్కూర్ రీచ్ నుంచి ఇసుక తరలించడం కేవలం ఒకరికి మాత్రమే అనుమతి ఉన్నది. ఇదే అదునుగా చేసుకున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ బడా నేత అనుచరులు కొందరు టిప్పర్లలో, ట్రాక్టర్లలో ఇసుకను తరలించి బయటి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వాగు నుంచి ఇసుకను తీసుకొచ్చి దాసర్‌దొడ్డి గ్రామ శివారులో డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి జేసీబీ సాయంతో టిప్పర్లలో నింపి ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అయితే వే బిల్లు పేరుతో పదుల సంఖ్యలో ట్రిప్పులు తరలించి దాసర్‌దొడ్డికి చెందిన కాంగ్రెస్ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా హస్తం పార్టీకి చెందిన నాయకులు రోజుకూ వందలాది ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. తామే తరలించి సొమ్ము చేసుకుంటామన్న ధోరణిలో రెండు వర్గాలుగా నేతలు విడిపోయినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆధిపత్యం కోసం ఒక వర్గం వారు ఇసుక తరలిస్తుంటే.. మరో వర్గం నేతలు మంగళవారం రోడ్డును అడ్డంగా తవ్వారు. దీంతో వాహనదారులు ఊళ్లోకి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొందరు కాంగ్రెస్ నేతల అనాలోచిత ధోరణితో తమకు ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

హన్వాడ : నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, ఏప్రిల్ 2 : ప్రతి కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హన్వాడ మాజీ సర్పంచ్ బాలయ్య కుమారుడు వెంకటేశ్ అనారోగ్యంతో మృతిచెందడంతో మంగళవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటేశ్ భౌతికకాయం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. అలాగే వెంకటేశ్ మృతదేహానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు సురేందర్‌రెడ్డి, ఎన్‌పీ వెంకటేశ్ నివాళులరించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ బాలరాజు, బీఆర్ఎస్ మం డలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, నాయకులు లక్ష్మయ్య, జంబులయ్య, శేఖర్, కృష్ణయ్యగౌడ్, రమణారెడ్డి, అనంతరెడ్డి, వెంకటేశ్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సుభాష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

ఊట్కూర్, ఏప్రిల్ 2 : మండలంలోని మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సుభాష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి..

భూత్పూర్, ఏప్రిల్ 2 : మున్సిపల్ పట్టణాధ్యక్షుడు సత్తూర్ సురేశ్‌గౌడ్ గుండె సంబంధిత వ్యాధితో మహబూబ్‌నగర్ జిల్లా కేం ద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం విషయం తెలిసిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దవాఖానకు వెళ్లి సురేశ్‌గౌడ్‌ను పరామర్శించారు. అనంతరం డాక్టర్‌తో మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కుటుంబ సభ్యులకు ధైర్యం ఇచ్చారు. వారివెంట గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, నాయకులు రాములు, ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

అడ్వాన్స్ ఆస్తి పన్ను చెల్లింపు..

- తొలి రోజు రూ.3లక్షల వసూలు

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2 : ఈ ఏడాదికి సంబంధించిన ఆస్తి పన్నును ఒకేసారి చెల్లిస్తే ఐదుశాతం రాయితీ వస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం రూ.3లక్షలకుపైగా ఆస్తి పన్ను వసూలు అయ్యింది. ముందుగా ఆస్తిపన్ను చెల్లించే వారు కిందటి ఏడాదికి సంబంధించి ఎలాంటి పన్ను బకాయి ఉండొద్దని కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆకస్మికంగా సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీ

భూత్పూర్, ఏప్రిల్ 2 : పట్టణంలోని సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏడీఏ యశ్వంత్‌రావు ఆధ్వర్యంలో వ్యవసాయాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఏవో మురళీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తి విత్తనాలలో నాసిరకం ఉండకుండా, రైతులను ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఉండాలనే ఉద్దేశంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్ట ప్రకారంగా సీడ్స్ నియమాలను పాటించాలని ఏడీఏ యశ్వంత్‌రావు హెచ్చరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయాధికారి సాంకేతిక సంచాలకుడు వినోద్, అ ర్బన్ ఏవో శ్యాంకుమార్ యాదవ్, దేవరకద్ర ఏవో రాజేందర్ ఉన్నారు.

సారా స్థావరాలపై దాడులు

మద్దూర్ (కొత్తపల్లి), ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మద్దూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతి లేకుండా సారా తయారు చేసినా, అక్రమంగా మద్యం విక్రయించినా చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సై రామ్‌లాల్ అన్నారు. మంగళవారం మండలంలోని పల్లెగడ్డతండా, మేడికుంటతండాల్లో కోస్గి సీఐ సోమనర్సయ్య ఆధ్వర్యంలో మ ద్దూర్, కోస్గి ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్‌పార్టీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి దాదాపు 1,125 లీటర్ల బెల్లం పానకం, 8లీటర్ల సా రా సాధీనం చేసుకొని పారబోశారు. వీటి విలువ రూ.లక్షా 15వేలు ఉం టుందన్నారు. దాడుల్లో కోస్గి ఎస్సై-2 నరేశ్, మద్దూర్ ఎస్సై-2 శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 2 : మండల కేంద్రం నుంచి షాబాద్ మహేశ్ అనే వ్యక్తి మంగళవారం నగదు తీసుకెళ్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా, కొల్లూరుకు చెందిన మహేశ్ రూ.63వేలు ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు చెప్పారు. డబ్బులకు సంబంధించిన ఆధారాలు చూపిస్తే తిరిగి తీసుకెళ్లవచ్చన్నారు. రూ.50వేలకు పైబడి డబ్బులు తీసుకెళ్తున్నట్లయితే అందుకు తగిన ఆధారాల పత్రాలు చూపాల్సి ఉంటుందన్నారు.

రూ.50,600లు పట్టివేత..

జడ్చర్ల (బాలానగర్), ఏప్రిల్ 2 : నియోజకవర్గంలోని బాలానగర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో మంగళవారం సయ్యద్ అమన్ అనే వ్యక్తి నుంచి రూ. 50,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమాడకు చెందిన అమన్ వద్ద రూ.50,600ల నగదుకు సంబంధించి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక లారీలు పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 2 : మండలంలోని యన్మన్‌గండ్ల గేట్ వద్ద మూడు ఇసుక లారీలను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మహబూబ్‌నగర్ నుంచి నవాబ్‌పేట వైపు మూడు ఇసుక లారీలు వెళ్తుండగా, యన్మన్‌గండ్ల గేట్ వద్ద వాటిని తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉగాది కరపత్రాల విడుదల

నారాయణపేట, ఏప్రిల్ 2 : పట్టణంలోని శక్తిపీఠంలో మంగళవారం ఉగాది పండుగ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శక్తిపీఠం ట్రస్ట్ సభ్యుడు రాములు మాట్లాడుతూ ఉగాది సందర్భంగా శక్తిపీఠంలో పంచాంగ శ్రవణం, పచ్చడి ప్రసాద వితరణ ఉంటుందన్నారు. అదేవిధంగా విశిష్ట సేవలందించిన వారికి ఉగాది పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మురళీధర్, యాదగిరి, ఉన్నారు.

నేడు పీయూలో జాబ్‌మేళా

పాలమూరు, ఏప్రిల్ 2 : పాలమూరు విశ్వవిద్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పీజీ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పీయూ అకాడమిక్ బ్లాక్‌లోని ఆడిటోరియంలో ఎంబీ ఏ, ఎంకాం, యూజీ విద్యార్థులకు రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్ట్ కోసం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఏర్పాటు
- జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, బళ్లారి రేంజ్ ఐజీపీ లోకేశ్‌కుమార్

మాట్లాడుతున్న జోగుళాంబ గద్వాల జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, బళ్లారి రేంజ్ ఐజీపీ లోకేశ్‌కుమార్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 2 : రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, కర్ణాటక సరిహద్దు పోలీసు అధికారులు సమిష్టి కృషితో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ ఎస్ చౌహాన్, బళ్లారి ఐజీపీ లోకేశ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జోన్-7 జోగుళాంబ డీఐజీ కార్యాలయంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మద్యం, నగదు అక్రమ రవాణా నియంత్రణపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. నిషేధిత మార్గా ల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు చేయాలని సూచించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణకు ఇరు రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. హైవే పెట్రోలింగ్‌తోపాటు మొబైల్ పెట్రోలింగ్ పెంచాలని, పోలీసు అధికారులు వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. జిల్లా సరిహద్దులో ఉన్న సమస్మాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్, గద్వాల ఎస్పీ రితిరాజ్, నారాయణపేట ఎస్పీ యోగేశ్‌గౌతమ్, రాయిచూర్ ఎస్పీ నిఖిల్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి

సీడీని ఆవిష్కరిస్తున్న పర్యావరణవేత్త పురుషోత్తంరెడ్డి

పాలమూరు, ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న బయోఫెస్ట్ కార్యశాల మంగళవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలాసవంతమైన జీవితం కోసం ఏసీ, రిఫ్రిజిరేటర్లలో, ప్రొపెలింగ్ గ్యాస్ వంటి రసాయనాల వల్ల జీవకోటి మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందన్నారు. మన దేశంలోనే భోపాల్‌లో 1984 డిసెంబర్ 2న యూనియన్ కార్బైడ్ ఇండియా లిమిటెడ్ అనే కంపెనీ అజాగ్రత్త వల్ల మిథైల్ ఐసోసైనేడ్ గ్యాస్ లీకేజీ వల్ల దాదాపు 3,800 మంది చనిపోయారని తెలిపారు. 3లక్షల మంది చర్మ, గొంతు, ఊపిరితిత్తులు, కంటికి సంబంధించిన ఎన్నో రుగ్మతులతో బాధపడినట్లు వివరించారు. రసాయన పదార్థాలతో పర్యావరణ పరిరక్షణకు తీరని నష్టం చేస్తున్నారని, ప్రజలంతా ఆలోచించాలని సూచించారు. అనంతరం జీవ వైవిధ్యానికి సంబంధించిన పుస్తకం, సీడీని ఆవిష్కరించారు. కార్యక్ర మంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, బయోఫెస్ట్ కన్వీనర్ అమీనాముంతాజ్ జహన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీపాద గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా

- చిరువ్యాపారులు స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోండి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

చిరువ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 2 : పేదలకు అండగా ఉంటామని, చిరువ్యాపారులు ఎలాంటి ఇబ్బందులేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోవాలని, తై బజార్ రద్దు చేసినట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో వీధి వ్యాపారులు, రైతులను పలకరించారు. తైబజార్ రద్దు పట్ల రైతులు, చిరువ్యాపారులు ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ కౌన్సిల్‌లో చట్టబద్ధంగా తీర్మానం చేసి తైజారు రద్దు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ఎన్పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, చిన్న, అబ్దుల్‌హక్ పాల్గొన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 2 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ నిర్వహణపై పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల పోలిం గ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు సిద్ధం కావాలన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన హ్యాండ్ బుక్‌లెట్‌ను క్షుణ్ణంగా చదివి పోలింగ్ విధా నం తెలుసుకోవాలన్నా రు. సందేహాలుంటే మాస్టర్ ట్రైనర్లను సం ప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది సమన్వయం తో, బాధ్యతాయుతంగా పని చేయాలని సూ చించారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే వారు మే 3 నుంచి 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌ను ఫెసిలేషన్ సెంటర్‌లో వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా అధికారులు కృష్ణమాచారి, టైటాస్‌పాల్, తాసీల్దార్లు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

మోటరును మరమ్మతు చేయిస్తున్న అధికారులు

మహ్మదాబాద్, ఏప్రిల్ 2 : ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పీఆర్ ఏఈ, గ్రామ ప్రత్యేకాధికారి ముతీమ్ తెలిపారు. మంగళవారం మండలంలోని గాధిర్యాల్‌లో తాగునీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిషన్ భగీరథ మరమ్మతులు ఉంటే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి హాజీ, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు పూర్తిచేసి సాగునీళ్లందిస్తాం

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణ

ధన్వాడ, ఏప్రిల్ 2 : ఎంపీగా తనను గెలిపిస్తే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అ భ్యర్థి డీకే అరుణ అన్నారు. మంగళవారం ధన్వాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ద్వారా ఉమ్మడి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోని 8లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తానని చెప్పారు. ఎల్లప్పుడూ ప్రజల్లో ఉండి సేవ చేస్తానని, తనను ఆదరించాలని ఆమె కోరారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, అభివృద్ధి కోసం గెలిపించాలన్నారు.

సర్కారు బడులను బలోపేతం చేయాలి

పాలమూరు, ఏప్రిల్ 2 : సర్కారు బడులను బలోపేతం చేయాల్సిన అవసరమున్నదని మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష సమావేశ మందిరంలో మంగళవారం ఉపాధ్యాయ సంఘాలు, సబ్జెక్టు ఫోరం ప్రతినిధుల ఆధ్వర్యంలో వేసవి ప్రణాళికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈవో హాజరై మాట్లాడారు. వేసవిలో విద్యార్థులకు అసైన్మెంట్ ఇచ్చి అభ్యాసనం చేయించాలన్నారు. డ్రాయింగ్, ఆర్ట్‌క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు వడదెబ్బ, ఈతలకు వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకునేలా ప్రచారం చేయాలన్నారు.

ఎక్సైజ్ పోలీసులకు అలవెన్సులు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బందికి అన్ని అలవెన్సులు ఇవ్వాలని ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, జిల్లా ఆబ్కారీశాఖ అధికారి విజయ్ భాస్కర్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రమేశ్‌సింగ్, ఉపాధ్యక్షుడు బాలరాజు, నాయకులు మధుకర్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలను విజయవంతం చేయాలి

నారాయణపేట, ఏప్రిల్ 2 : ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించే రాష్ట్రీయ కళామంచ్ సింగిడి-2024 సాంస్కృతిక పోటీల్లో కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేశ్, నగర కార్యదర్శి చరణ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రీయ కళామంచ్ సింగిడి-2024 పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇంతియాజ్, నగర ఉపాధ్యక్షులు వివేకానంద తదితరులు పాల్గొన్నారు.